# దీపం

## రేవతి

సాయంత్రం ఆరు గంటలయింది. పగలల్లా తన ప్రతాపం చూపించిన సూర్యుడు అలసిపోయిన శ్రమజీవిలా పడమటి దిశగా జారుకుంటున్నాడు. మధ్యాహ్నమల్లా ఎడతెగక వీచిన వడగాలులు అప్పుడప్పుడే కొత్త చల్లబడి పిల్లతెమ్మెర్లుగా మారుతున్నాయి.

సింహాచలం బస్టాండ్ కోలాహలంగావుంది. ఆరోజు అక్కడ కూరగాయల సంత కావటాన రోజూ కంటే మరింత హడావిడిగావుంది. పగలల్లా కూరగాయ లమ్ముకుని ఖాళీ బుట్టలతో వ్యాపారులు ఆ స్టాండంతా ఆక్రమించేశారు. ఆఫీసులు. కాలేజీలు అప్పుడే వదిలారేమో, దానికితోడు పొరుగూరికి బయలు దేరే సినిమా జనం, ప్రపంచంలో ఎక్కడలేని జనాభా యిక్కడే వున్నారేమో అనిపిస్తోంది.

విజయ చిరాగ్గా మరోసారి వాచీ చూసుకుంది. బస్ వచ్చే దిశగా చూసింది. కనుచూపుమేరలో ఎక్కడా బస్ వస్తోన్న జాడే లేదు చేతిలోవున్న వీక్లీ తిరగెయ్యటం ప్రారంభించింది

పది నిమిషాలు పుస్తకం తిరగేసేసరికి చిరాకేసింది. బస్ యిప్పట్లో రాదని ఆమె కర్థమైపోయింది. నుదుటికిపట్టిన చెమటంతా కర్చీఫ్‌తో తుడుచుకుంది. మళ్ళీ వీక్లీలో తల దూర్చింది.

"విజయమ్మా బావున్నావా?" ఆశ్చర్యంతో తలెత్తి చూసింది విజయ. ఎదురుగా ఓ ముసలమ్మ.

"నువ్వు......?" గుర్తురాలేదు విజయకి.

"నేను నర్సమ్మనమ్మా మర్చిపోయావా?" బోసిగా నవ్వింది ముసలమ్మ.

విజయకి గుర్తుకొచ్చింది. ఆవిడ తను గోపాల పట్నంలో వుండేటప్పుడు రోజువారి కూరగాయ లమ్మిన ముసలమ్మ.

"ఏపనుకోకు నర్సమ్మా. ఏదో పరధ్యానంగా వున్నా..... నువ్వు బావున్నావా?" నవ్వుతూ అడిగింది విజయ.

"నువ్వు యిక్కడున్నావేమమ్మా......." అడిగింది నర్సమ్మ.

"నీకు తెలీదుకదా..... నేనిక్కడే ఆంధ్రాబ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నా...."

"ఎప్పుడో ఆరేళ్ళక్రిందట అందర్నీ చూసేనమ్మ..... మీరు యిల్లు మారాక యిదే కనిపించటం.... అంతా కులాసేనా అమ్మా?" అప్యాయంగా అంది నర్సమ్మ.

"ఆఁ....." నిర్లిప్తంగా అంది విజయ.

"నీకు పెళ్ళయిందా విజయమ్మా?" ఆమె కళ్ళు విజయ మెడవైపు చూసాయి.

ఒకక్షణం మౌనం. తర్వాత అంది విజయ. "లేదు."

"నాన్నగారేం ప్రయత్నించలేదా అమ్మా?"

"కాదు...... కొంతకాలంవరకు నేనే చేసుకో నన్నాను."

దూరంగా బస్సు శబ్దం వినిపించింది.

"నర్సమ్మా..... అదిగో బస్సు......"

"వస్తానమ్మా.... " నర్సమ్మ తట్టపట్టుకుని పరిగెత్తింది.

విజయ ఊపిరిపీల్చుకుంది నిట్టూర్చి.

పావుగంట తర్వాత చినవాల్తేర్ బస్సొచ్చింది. రష్‌గావుంది. విజయ కష్టపడి ఎక్కింది.

* * * *

"ఏమ్మా యింత ఆలస్యం?" గుమ్మంలో కూర్చున్న వెంకట్రామయ్య లోపలికి అడుగుపెడుతున్న విజయనడిగాడు.

"బస్ దొరకటం ఆలస్యమైంది నాన్నా" తండ్రి సమాధానంగురించి ఎదురుచూడకుండానే లోపలికి నడిచింది.

"ఏవిఁటే యింత ఆలస్యం.....?" కూరగాయలు తరుగుతున్న తల్లి లోపల్నుంచి కేకేసింది

విజయకి చిరాకేసింది.

"నేనేం ఊరంతా తిరిగిరావటంలేదమ్మా..... రోజూ



పదిమైళ్ళదూరం చచ్చీచెడీ బస్సులో ప్రయాణించాలి..... ఉద్యోగం మానెయ్యాలా చెప్పు?" కూతురలా నిలదీసేసరికి జానకమ్మ విస్తుపోయింది.

"ఇప్పుడు నేనేం అన్నానమ్మా?" ఆవిడ ముఖం చిన్నబుచ్చుకుంది.

తల్లిముఖం చూడగానే విజయ మనస్సు చివుక్కుమంది.

"అదికాదమ్మా..... నాకేం సరదానా ఆలస్యంగా రావటం..... గంటముందే యింటికి రావాలని నాకూ వుంటుంది. ఆ బస్‌స్టాప్‌లో పడిగాపులుకాసేసరికి నాపనయిపోతోంది" అనునయంగా అందామె.

"నిజమేనమ్మా...... స్నానంచేసి బట్టలు మార్చుకోమ్మా" కూతురివైపు ప్రేమగా చూస్తూ అంది జానకమ్మ.

ఆ రాత్రి విజయ భోంచేసి చదువుకుంటున్నప్పుడు చెప్పాడు వెంకట్రామయ్య

"రేపు నీ గురించి పెళ్ళివారొస్తున్నారమ్మా."

"ఊఁ....." వెనక్కి చూడకుండానే అంది విజయ.

"రేపు శెలవుపెడతావా?"

"కుదరదు నాన్నా.... సెలవు లివ్వరు యిప్పట్లో."

"మంచి సంబంధమమ్మా..... ఏలూరు వాళ్ళది.... అబ్బాయి సెంట్రల్ గవర్నమెంటు వుద్యోగి......" ఆగాడు వెంకట్రామయ్య.

"అయితే ఏం చెయ్యమంటావు?" చిరాగ్గా అంది విజయ.

"నువ్వు ఊఁ అంటే..... " నసిగాడు వెంకట్రామయ్య.

ఇప్పటి కెన్ని సంబంధాలు నాన్నా.... అసలు నాకే విసుగేస్తోంది. పెళ్ళిచూపులకని ఎవడో ఓ అడ్డగాడిద రావటం..... వాడడిగే వెధవ ప్రశ్న లన్నింటికీ ఏదో తప్పుచేసినట్టుగా తలొంచుకుని జవాబు చెప్పటం...... తీరా చూశాక ఊరెళ్ళి ఉత్తరం రాస్తాననటం, తర్వాత మీ అమ్మాయి నచ్చలేదనో, మీ అమ్మాయి ఎవడితోనో తిరుగుతోందనో, లేదా మీ అమ్మాయి శీలం మంచిదికాదనో ఉత్తరం రాయటం...... నీకు ఏమీ అనిపించకపోయినా....... నాకుమాత్రం పెళ్ళిచూపులన్నా, పెళ్ళన్నా ఎలర్జీ పుట్టింది..... దయచేసి నన్నుమాత్రం విసిగించకు...." ఆమె గుండెల్లో ఉక్రోషం అంతా బయటపడింది.

అయిదునిమిషాలు మౌనం తర్వాత అన్నాడు వెంకట్రామయ్య.

"ఈ ఒక్కసారికీ నామాట కాదనకమ్మా..... నీకంటే చిన్నవాళ్ళిద్దరికీ నువ్వు పెళ్ళిచేసావు. కానీ నీకింత వరకు పెళ్ళికాలేదు. లోకం ఏమనుకుంటుందో ఆలోచించు. నీగురించికాదు.... నాగురించి..... కనీసం కూతురు పెళ్ళి చెయ్యలేని వెధవనని లోకం నన్ను దుమ్మెత్తిపోస్తుంది. కనీసం ఈ ఒక్కసారి నాగురించి ఒప్పుకో" తండ్రి కళ్ళలో నవ్వుచూసి చలించిపోయింది విజయ.

క్షణం తర్వాత......

"సరే నాన్నా..... నీగురించి ఈ ఒక్కసారికీ ఒప్పుకుంటున్నా" ఏదో స్థిర నిశ్చయానికి వచ్చినదానిలా అంది.

ఆ రాత్రంతా విజయకి నిద్రపట్టలేదు. ఆలోచిస్తోంది. ఆమెకి కిషోర్ గుర్తుకొచ్చాడు. గుండెల్లో ఆవేదన. ఉక్రోషం మొదలయింది. తను డిగ్రీ చదువుతున్నరోజుల్లో తన వెంటపడేవాడతను. తనను ప్రేమిస్తున్నానని, తను ప్రేమించకపోతే ఛస్తానని ఓ సారి ఒంటరిగా కంటపడినప్పుడు కంట తడిపెట్టుకున్నాడు. తనకి నవ్వొచ్చింది. జాలేసింది. అలా పరిచయమైన ప్రేమ ఆర్నెల్లు సాగింది. అతనితో సినిమాలు, షికార్లు ఎంతో హాయిగా



గడిచాయా రోజులు. ఈ సంగతి తనింట్లో తెల్సింది ఆ కుర్రాణ్ని పిలిస్తే మాట్లాడతానన్నాడు తన తండ్రి. ఆ విషయం కిషోర్‌కి చెబితే తన యింటికి రావటానికి ఒప్పుకోలేదు. తనతో పరిచయం పెంచుకున్నది పెళ్ళిచేసుకోటానికి కాదని, ఏదో సరదాగా గడపటానికని అన్నాడు తను ఏడ్చింది. కాళ్ళుపట్టుకుని బ్రతిమాలింది అతను కరగలేదు తరవాత చాన్నాళ్ళు కనిపించలేదు. ఆ తర్వాత కొంతకాలం తనెంతో నిరాశగా రోజులు గడిపింది.

డిగ్రీ పూర్తయిన ఆర్నెల్లకే బ్యాంకు పరీక్ష పాసవటంవల్ల తనకి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చిన ఆర్నెల్లకి ఓ రోజు కిశోర్ బ్యాంకుకొచ్చాడు తను ఉద్యోగం చేస్తున్నానని ఈమధ్యనే తెలిసిందని, తనని పెళ్ళిచేసుకోటానికి సిద్ధమేనని అన్నాడు అంత జరిగాక మళ్ళీ కిశోర్‌తో కలిసి బ్రతకటానికి తనకు మనసొప్పలేదు తనకు ఉద్యోగం వచ్చిందన్న సంగతి తెలిసే కిశోర్ మనసు మార్చుకున్నాడని తనకు తెలుసు అటువంటి నయవంచకుడితో కాపురం చెయ్యటం, విషసర్పానికి పాలు పొయ్యటమేనని తనకు తెలుసు. పెళ్ళి విషయం ఎత్తవద్దని మర్యాదగా చెప్పేసింది. కిశోర్ బెదిరించాడు పెళ్ళిచేసుకోకపోతే యిక తనను జన్మలో పెళ్ళికాకుండా చేస్తానని వెళ్ళిపోయాడు కోపంగా.

ఆ తర్వాత తనకు వచ్చిన సంబంధాలన్నీ అతనే పెళ్ళివారికి లేనిపోనివి కల్పించి రాసి తన పెళ్ళి చెడగొడుతున్నాడు. తను బ్యాంకు లోనుపెట్టి తన తరవాత చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిచేసిందిగానీ తన పెళ్ళి యింతవరకు కాలేదు

తొలిఝాము కోడి కూయటంతో విజయ ఆలోచనలకు తెరపడింది. అప్పుడే మగత నిద్రలోకి జారిపోయింది.

ఆ మర్నాడు సాయంత్రం పెళ్ళివారొచ్చారు తల్లీ, తండ్రి, పెళ్ళికొడుకు. పెళ్ళికొడుకు దర్జాగా వున్నాడు విజయ తలొంచుకుని కూర్చుంది అయిష్టంగానే

## ఆటలు – అద్భుతాలు

# అతి కష్టమైనపందెం

ప్రపంచంలో అన్నిటి కంటే కష్టతరమైన మోటార్ల పందెం ఐదు రోజులపాటు జరిగే మూడు వేల మైళ్ళ కెన్యాసఫారీ పందెం. 1981లో చంద్రశేఖర్ ఖిమ్జి వరుసగా మూడుసార్లు గెలుపొందిన హ్యాట్‌ట్రిక్ చేసిన మొదటి వ్యక్తి అయ్యాడు.






## దీపం

ఆమె యిబ్బందిని గమనించినట్టున్నాడతను విజయను ఎక్కువ ప్రశ్నలేవి వేసి వేధించలేదు

తతంగమంతా అరగంటలో పూర్తయింది. కట్నం గురించి అసలడగలేదు. అందరిలాగ వూరెళ్ళి వుత్తరాలు రాస్తామని చెప్పకుండా అప్పటికప్పుడే ఉంగరాలు మార్చి ప్రధానంకూడా చేసుకున్నారు

వెంకట్రామయ్య, జానకమ్మల సంతోషానికి అవధుల్లేవు. నిజంచెప్పాలంటే ఏ సంబంధం కూడా యిలా ప్రధానం వరకూ రాలేదు. తరవాత నెలలోనే పెళ్ళి. అంతా విజయ అదృష్టవంతురాలన్నారు.

విజయకు అర్థంకాలేదు యిది కలో? నిజమో? అంతా నిమిషాల మీద జరిగిపోయింది. ఏ ఆటంకంలేకుండావుంటే ఈ పెళ్ళి జరిగిపోయినట్లే. అంటే తనూ ఓ యింటిది కాబోతోందన్నమాట. ఈ వూహ ఆమెను పులకరింపజేసింది. ఆమె మనసంతా వసంతకోకిలలా వూహల్లో విహరించింది. పదేపదే ప్రధానపుటుంగరంవైపు చూసుకుని మురిసి పోయింది. పెళ్ళికి నెలంటే నెలే గడువుంది. నెల రోజుల్లో ఒక్కరు కాస్తా యిద్దరవుతారన్నమాట. ఆమె మనసు తీయని ఆలోచనలతో నిండిపోయింది.

పదిహేనురోజులు గడిచాయి.

– ఆరోజు ఆఫీసునుండి రాగానే యింట్లో అడుగు పెడుతున్న విజయకు ఏదో మార్పు కనిపించింది. పడక్కుర్చీలో తలపట్టుకు వెనక్కివాలిన తండ్రి, వంటింట్లో ఓ మూల గోడకి చేరబడి కూర్చున్న తల్లి, ఎప్పుడూ పుస్తకమే పట్టుకుని ఎరగని యిద్దరు తమ్ముళ్ళూ బుద్ధిగా చదువుకుంటున్న తీరు. ఆమె మనసు ఏదో కీడు శంకించింది. అసలు ఆమె రాకనే యింట్లో ఎవరూ గమనించనట్టు ప్రవర్తిస్తున్నారు.

ఆమె మౌనంగా గదిలో కెళ్ళి బట్టలు మార్చుకుంది.

"ఏం జరిగింది నాన్నా.... అలా వున్నారేం అంతా?" తండ్రి వెనకచేరి నెమ్మదిగా అడిగింది విజయ.

"నా ఖర్మమ్మా అంతా నా ఖర్మ......" నుదుటిమీద చేత్తో కొట్టుకున్నాడాయన.

జరిగింది అర్థమయింది. ఆమె మనసును స్థిరంగా వుంచుకోటానికి ప్రయత్నిస్తోంది.

"ఎవడో దౌర్భాగ్యుడు నీమీద పగబట్టాడమ్మా....... ా బ్రతుకుతో ఆటలాడుకుంటున్నాడు. పెళ్ళి కుదిరినట్టే కుదిరింది. ఇంతలోనే అంతా మాయలాగ తలక్రిందులైపోయింది పరిస్థితి. ఆ ...పడో రాసిన వుత్తరం నీ కొంపముంచింది మీ





## అత్యధిక కప్ విజేతలు

ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో అత్యధిక విజయాలు సాధించిన వారు పశ్చిమ జర్మన్‌లు. 1954లో వారు ఆరు ఆటలలో 25 గోల్‌లు సాధించారు. అంటే ఒక్కొక్క ఆటకు 4.16 గోల్‌లు సాధించారన్న మాట.



## మొట్టమొదటి గుర్రాల ప్రదర్శన

మొట్టమొదటి అంతర్జాతీయ గుర్రాల ప్రదర్శన 1901లో ట్యూరిన్‌లో జరిగింది. అప్పుడు ఇటలీ వారికి వ్యతిరేకంగా జర్మన్, స్విస్ సైనికాధికారులు పోటీ పడ్డారు.

సంబంధం మా కక్కర్లేదంటూ పెళ్ళివారు ఉత్తరం రాసారు. నీకు..... యింక నీ కీ జన్మలో పెళ్ళిచెయ్యలేనమ్మా...... " ఆయన నుదురుబాదుకుని గొల్లుమన్నాడు.

విజయ తండ్రిని పూరడించలేదు. ఆమె మౌనంగా తన గదిలోకి నడిచింది. ఆమె మంచంమీదపడి వెక్కివెక్కి ఏడవలేదు. మౌనంగా వీక్లీ తీసుకుని తిరగెయ్యసాగింది ఏం జరగనట్టుగానే. ఇలాంటి పరిస్థితులు తను ఎన్నోసార్లు ఎదుర్కొంది. తన గుండెప్పుడో బండబారిపోయింది. అయితే తను చేసిన పొరపాటల్లా ఈసారి పెళ్ళిగురించి ఎక్కువ ఆశలుపెట్టుకోవటం. ఆమె ఆలోచిస్తోంది. ఆమె ఆలోచనలు తన పెళ్ళి చెడిపోయినందుకుకాదు. తన పెళ్ళని ఆఫీసులో అందరికీ ఎంతో ఆనందంగ చెప్పింది. వాళ్ళకేం సమాధానం చెప్పాలీ అని?

అరగంట గడిచాక తండ్రి గదిలోకి వచ్చాడు.

"ఇదిగోనమ్మా నీ బ్రతుకు పాడుచేసిన ఉత్తరం – కాలేజీ రోజుల్లో నీతో తిరిగిన వెధవేనా యిది రాసింది...... ఓసారిచూడు. వాడినిక వదిలిపెట్టను." ఆవేశంగా అరిచాడు వెంకట్రామయ్య.

విజయ ఉత్తరం అందుకుని చదివింది. తిరిగి తండ్రి కిచ్చేసింది.

"ఎవడూ ఆ వెధవేనా?"

"ఏమో అతని రాత నాకు గుర్తులేదు. అయినా నా తలరాత యిలా వుంది. నువ్వు ఎవర్నీ ఏం అనకు. వాళ్ళపాపాన వాళ్ళుపోతారు."

ఆమె తిరిగి పుస్తకంలో తలదూర్చింది ఆమె గుండెల్లో రేగుతున్న అగ్నిసెగలసంగతి తండ్రి గమనించకుండా.

• ఆ రాత్రి వెంకట్రామయ్యకి నిద్రపట్టలేదు. ఆయన ఆ రాత్రి భోంచెయ్యలేదు. అశాంతిగాపడక్కుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాడు. మాటిమాటికీ విజయ రూపమే అతనికి గుర్తు కొస్తోంది. అతను ఆలోచిస్తున్నాడు. తన కూతురు పెళ్ళిచెయ్యలేని దౌర్భాగ్యానికి తనను తనే నిందించుకున్నాడు. తనమీద తనకే అసహ్యం వేస్తోంది. ప్రపంచంలో ఏ తండ్రీ కూడా తనంత కిరాతకంగా ప్రవర్తించడేమో! కన్న కూతురు బతుకు పాడుచేసిన కసాయివాడు తను. ఏ తండ్రీ చెయ్యనిపని తను చేస్తున్నాడు.

పెళ్ళి కుదిరినప్పుడల్లా తన కూతురి గురించి తనే చెడుగా ఉత్తరాలురాసి ఆ పెళ్ళిళ్ళు జరక్కుండా చేస్తున్నాడు. అవును. తన కూతురు పెళ్ళయి వెళ్ళిపోతే మరి తనగతి? తను సాధారణ గుమాస్తాగా పదేళ్ళక్రితమే రిటైరయ్యాడు. తనకు తండ్రి, తాతలు సంపాదించిన ఆస్తులేమీ లేవు. అసలు తనూ అందరి తండ్రుల్లాగే తన కూతుర్నీ పెళ్ళికూతురిలా చూడాలనుకున్నాడు. కానీ తన కూతురు ఉద్యోగంచేస్తున్నప్పటి నుండే తనలో స్వార్థం ప్రవేశించింది. ఆమే గనక వెళ్ళిపోతే...... తను, గుండెజబ్బుతో వున్న తన భార్య, యిద్దరాడపిల్లలు, ఊహతెలియని యిద్దరు మగపిల్లలు తుక్కుబతుకు బ్రతికేవారు. ఆమె వెళ్ళిపోతే తన చిన్న కూతుళ్ళిద్దరికీ పెళ్ళి కాదనే భయంతో పెద్దకూతురి పెళ్ళి చెడగొట్టి, సంబంధాలు కుదిరాయనే నెపంతో తరవాత ఆడపిల్లిద్దరికీ పెళ్ళిళ్ళు జరిపించేశాడు. తనే ఉత్తరాలు రాసి పెళ్ళిళ్ళు చెడగొట్టానన్న సంగతి విజయకు తెలిస్తే యింకేమన్నావుందా? ఆమె తనని కుష్టురోగికన్నా హీనంగా చూడదూ...... కానీ విజయంటే తన కెప్పుడూ ఆరో ప్రాణమే. ఆమె తన రెండు కళ్ళు, తనింటి దీపం. ఆమె లేకపోతే తన బ్రతుకే అమావాస్య చీకటి. వెంకట్రామయ్య ఆలోచనలు పూర్తయ్యాయి. అతని కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

గదిలో నిద్రపోతున్న విజయ ఉలిక్కిపడిలేచింది. ఏదో పీడకల. లేచి నీళ్ళు త్రాగింది. మళ్ళీ మంచంమీద చేరబడింది. ఆమెకింక నిద్రపట్టలేదు. ఆలోచనలు ఆమెను ముసురుతున్నాయి. ఇక తనకు పెళ్ళికాదనే భయంకరమైన నిజం ఆమెను కృంగదీస్తోంది. తనకిక జన్మలో పెళ్ళికాదు. పెళ్ళిచేసి అత్తారింటికి పంపవల్సిన తండ్రే తనపాలిట శత్రువై, దొంగ ఉత్తరాలు రాసి తన పెళ్ళి చెడగొడుతుంటే, యిక తనెవరితో చెప్పుకోగలదు. ఇన్నాళ్ళూ కిశోర్ తన పెళ్ళి చెడగొడుతున్నాడని అనవసరమైన భ్రమతో అతన్ని ద్వేషించింది. కానీ సాయంత్రం తండ్రి ఉత్తరం యిచ్చినప్పుడు తనకు తెల్సింది. ఆ ఉత్తరాలు రాసేది తన తండ్రేనని. ఎంతమార్చి రాసినా తన తండ్రి రాత తను గుర్తుపట్టగలదు. అయినా తన తండ్రిని స్వార్థపరుడనటానికి తనకు మనసురావటంలేదు. మరి తను పెళ్ళయి వెళ్ళిపోతే వాళ్ళందరిగతీ ఏంకావాలి? తన తండ్రిమీద తనకేం కోపంలేదు. జాలేస్తోంది. తనకు చాలా బాధగా వుంది. తన పెళ్ళిచెడిపోయినందుక్కాదు తన పెళ్ళి చెడగొట్టినందుకు తన తండ్రెంత కుమిలిపోతున్నాడో అని.

"భగవంతుడా నా తండ్రిని ప్రశాంతంగా నిద్రపోనీ" ఆమె మనసులో దేవుడికి మొక్కుకుంది. □